నీరులేక నోరెళ్లబెట్టిన బోర్లు

- ఆగమవుతున్న వాగు కింది రైతులు
- మాన్‌దొడ్డిలో అడుగంటిన భూగర్భ జలాలు
- చుక్కనీరు లేక ఎండుతున్న వరి


భూగర్భ జలాలు అడుగంటడంతో చుక్క నీరురాక ఎండిన బోర్లు

రాజోళి: మండుతున్న ఎండలతో గ్రామాల్లో ఉన్న తాగునీటి వనరులు పూర్తిగా అడుగంటాయి. ప్రతి ఏడాది వాగుల్లో, వంకల్లో ఉన్న నీటి ఆధారంగా పంటల సాగుతో పాటు, పశువులకు నీరు లభించేది. ఈ ఏడాది వేసవికాలం ఆరంభంలోనే నీరు లేక పోవడంతో ఇటు పాడి రైతులు, సాధారణ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో వాగులో ఉన్న నీటి లభ్యత ఆధారంగా వరి పంటలు సాగు చేశారు. పాడి రైతులకు పశు గ్రాసం కూడా లభ్యమయ్యేది. కాని ప్రస్తుతం కరువు ఛాయలు గ్రామంలో కనిపిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రైతుల బెంబేలు..

గ్రామ సమీపంలోని వాగులో నీరు ఉండటంతో ప్రతి ఏడాది ఈ సమయంలో రైతులు వరి పంటను సాగు చేసేవారు. వందల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులకు ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో పాటు, ఎగువ ఉన్న ప్రాజెక్టుల నుంచి వరద నీరు రాకపోవడంతో వాగుల్లో కనీస స్థాయిలో నీరు లేక అడుగంటిపోయింది. పశువులకు తాగు నీరు, గ్రామ ప్రజల అవసరాలతో పాటు, చుట్టు పక్కల రైతులు మోటార్ల ద్వారా పంటలకు నీరందించుకునేవారు. వాగులో నీరు ఉండటంతో చుట్టు పక్కల భూగర్భ జలాలు పెరిగి, పొలాల్లో ఉన్న బోర్ల ద్వారా నీరు పుష్కలంగా రావడంతో పంటల చివరి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తడులకు వాడేకునేవారు. ఈ ఏడాది బోర్లలో నీరు అడుగంటి పోయింది. ఇప్పటికే ఉన్న నీరు మొత్తం బోర్ల ద్వారా రాగా, పంటలకు అందించామని, ఇకపై నీరు అందుతుందా లేదా అని ఆందోళన తప్పడం లేదు.


చుక్క నీరు లేక ఎడారిగా మారిన మాన్‌దొడ్డి వాగు


బోర్లు అడుగంటడంతో ఎండుతున్న వరి పైర్లు

తాగునీటిపై ప్రభావం..

వాగులో ఎప్పుడూ కనీస మట్టంలో నీరుండేది. తక్కువ మొత్తంలో ఉంటే కూడా పశువులకు తాగు నీరు, వివాహాలు, ఇతర కార్యాలయాలకు ట్యాంకర్ల ద్వారా తీసుకెళ్లేందుకు వాగులో నీటి లభ్యత ఉండేది. ఇప్పుడు వాగు మొత్తం అడుగంటి పోయి, ఎడారిని తలపిస్తోంది. దీని వల్ల గ్రామంలో ఉండే ట్యాంకులు, బోర్లపైనే ప్రజలు అన్ని అవసరాలకు ఆధారపడాల్సి వస్తోంది. దీంతో ఉన్న వనరులను స్థాయికి మించి వాడుకుంటే, రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగి, నీటి ఎద్దడి ఎక్కువై తాగు నీటిపై ప్రభావం పడుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రైతులు లక్షల్లో పెట్టుబడి పెట్టి ఎండుతున్న వరి పైర్లను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

బోర్లలో చుక్క నీరు రావడం లేదు



ప్రతి సంవత్సరం బోర్ల నీటి నుంచి పంటలకు సాగు నీరు అందించేవాళ్లం. ఎప్పుడూ ఇంతగా బోర్లు అడుగంటలేదు. వాగులో కనీసం తేమ కూడా లేదు. దీంతో భూగర్భ జలాలు మొత్తం అడుగంటాయి. పంటలకు నీరందించేందుకు అన్ని ప్రయత్నాలు అయిపోయాయి. పచ్చని వరిపైర్లు మొత్తం ఎండుతున్నాయి. ఏడాది ఆరంభం నుంచి వేసిన ప్రతి పంట ఎండుతోంది. చివరిలో వేసిన వరి పంట కూడా పూర్తిగా ఎండుముఖం పట్టింది.

– రామన్ గౌడ్, రైతు, మాన్‌దొడ్డి

ఎడారిని తలపిస్తోంది..



ప్రతి ఏటా గ్రామంలో ఉన్న వాగులో నీరు ఉండేది. ఎంతటి వేసవి కాలమైనా కనీస అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉండేది. కాని ఈ ఏడాది మొత్తం వాగులో నీరు అడుగంటి, ఇప్పుడు ఎడారిలా మారింది. ముందు ముందు తాగునీటితో పాటు అన్ని అవసరాలకు ఎలాంటి పరిస్థితి వస్తుందో ఆందోళనకరంగా ఉంది. ఇప్పటికే వరి పైర్లు ఎండాయి, బోర్లు అడుగంటాయి.

– చిన్న, రైతు, మాన్‌దొడ్డి

క్లుప్తంగా

ఓఆర్ఎస్‌ను తప్పక అందించండి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల వారీగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు, ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు



అయిజ: అంబేద్కర్ జయంతిని సందర్భంగా అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో 'రాజ్యాంగం రచనలు' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 240 మంది విద్యార్థులు వ్యాస రచన పోటీల్లో పాల్గొన్నారు. అయిజ అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు సుబ్బన్న, లోకరాజు, బీసన్న, శ్రీకాంత్, ఆంజనేయులు, ఆనంద్ రాజు, ఇసాక్, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్



గద్వాల అర్బన్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అన్నారు. శనివారం గద్వాల మండలంలోని చెనుగోనిపల్లి ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు, వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకెళ్తూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికృష్ణ, రామన్‌గౌడ్, బాలరాజు, తస్వీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

బిందు సేద్యంతో కూరగాయల సాగు

శాంతినగర్: వేసవి కాలంలో బిందు సేద్యం ద్వారా కూరగాయల సాగు లాభసాటిగా ఉంటుందని ఏఈఓ చంద్రకళ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ సమీపంలో బెల్ల అనిల్‌కుమార్ బిందు సేద్యం ద్వారా సాగుచేసిన పామాయిల్ తోటలో వేసిన కూరగాయల పంటను ఏఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ ఎండలు మండుతున్నందున బిందు సేద్యం ద్వారా కూరగాయలకు నీరందిస్తే దిగుబడి బాగా వస్తుందని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. కూరగాయల ధరలు అధికంగా ఉన్నందున రైతులు పంటలను జాగ్రత్తగా కాపాడుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.

ఆయిల్‌పామ్ తోట కాల్చివేత



మానవపాడు: మండలంలోని కొర్విపాడులో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు 40 ఆయిల్ పామ్ తోటకు నిప్పు పెట్టడంతో కాలిపోయిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు మహ్మద్ హుస్సేన్ వివరాల మేరకు.. తన రెండు ఎకరాల పొలంలో ఆయిల్‌పామ్ సాగు చేశాడు. అందులో డ్రిప్‌ను ఏర్పాటు చేశాడు. దుండగులు నిప్పు పెట్టడం వల్ల ఆయిల్ ఫామ్ మొక్కలతో పాటు డ్రిప్ మెటీరియల్ సైతం కాలిపోయింది. దీంతో రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించాలి

మానవపాడు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నీటి సమస్యలు రాకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పాతబోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు


విద్యుత్ తీగలు సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండల కేంద్రం నుంచి అమరవాయి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గుండా విద్యుత్ తీగలు వేలాడుతూ ఉన్నాయి. దీనికి సంబంధించి 'ఒరిగిన విద్యుత్ తీగలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు కొత్తగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు సరి చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గుడ్డెందొడ్డిలో ప్రీమియర్ లీగ్ పోటీలు

ధరూరు: మండలంలోని గుడ్డెందొడ్డిలో ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా భజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు ప్రీమియల్ లీగ్ సీజన్–4 క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతి, షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం


గద్వాల బ్రాంచీని ప్రారంభిస్తున్న డీజీఎం సుధాకర్, రీజినల్ మేనేజర్ టీవీఎస్ శర్మ

గద్వాల అర్బన్: బ్యాంక్ ఆఫ్ బరోడా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు హైదరాబాద్ డివిజినల్ నెట్‌వర్కర్ డీజీఎం సుధాకర్, రీజినల్ మేనేజర్ టీవీఎస్ శర్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను వారు ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులు బ్యాకింగ్ సేవలు అందించేందుకు ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యప్పరెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ భీమేశ్వర్ రెడ్డి, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు

గద్వాల అర్బన్: 18ఏళ్లు నిండని అమ్మాయిలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు అన్నారు. శనివారం గద్వాల మండలంలోని తుర్కోనిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాలు, చైల్డ్‌లైన్ సేవలపై ఆయన అవగాహన కల్పించారు. బాలలు ఎవరైనా ఇబ్బందులు, వేధింపులకు గురైతే వెంటనే 1098, డయల్ 100టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. వేసవి కాలంలో పిల్లలను ఈతకు పంపరాదని, తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్ తదితరులు ఉన్నారు.

జీఓ 1334ను ఉపసంహరించుకోవాలి


సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

గద్వాల అర్బన్: అంగన్‌వాడీ టీచర్లకు నష్టం వాటిల్లేలా ఉన్న జీఓ నంబర్ 1334ను తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈమేలమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతంలో పోరాటాలు చేసి సాధించుకున్న టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ యాథావిధిగా కొనసాగిస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు జీఓ 1334ను తీసుకొచ్చి రూ.లక్ష బెనిఫిట్స్‌ను ఇస్తామంటున్నారని మండిపడ్డారు. 65ఏళ్లు నిండిన ఆయాలకు ఇంటికి పంపేందుకు సిద్ధమైందన్నారు. వెంటనే యాథావిధిగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదమ్మ, సీతమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, తదితరులు ఉన్నారు.

గొప్ప సిద్ధాంతవేత్త బీటీ రణధివే


అలంపూర్‌లో బీటీ రణధివే వర్ధంతిలో నాయకులు, ఉపాధ్యాయులు

అలంపూర్: బీటీ రణధివే గొప్ప సిద్ధాంతవేత్త అని సీఐటీయూ సహాయ కార్యదర్శి ఏమేలమ్మ అన్నారు. అలంపూర్ పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో శనివారం బీటీ రణధివే 34వ వర్ధంతిని సీపీఎం అధ్వర్యంలో నిర్వహించారు. ఈ బీటీ రణధివే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ బీటీ రణధివే ఒక గొప్ప సిద్ధాంతవేత్త, ఆలోచనపరుడు, మేధావి, రచయిత, పోరాటయోధుడని కొనియాడారు. ఆయన 1904లో బాంబేలోని దాదల్‌లో జన్మించినట్లు తెలిపారు. ఆయన 86 ఏళ్ల జీవితం ట్రేడ్ యూనియన్ ఉద్యమమే ఊపిరిగా సాగిందన్నారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి ఉద్యోగులు, కార్మికుల కోసం సాధించిన హక్కులు, చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు. బీటీ రణధివే సాధించిన చట్టాలు తిరిగి సాధించుకోవాలంటే కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు, రైతులు ఏక తాటిపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, సీపీఎం మండల కార్యదర్శి నరసింహ, కేవీపీఎస్ మండల కార్యదర్శి నాగరాజు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, పాఠశాల ఉపాధ్యాయులు సుజాత, నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీకాంతమ్మ, సావిత్రి, మాధవి, ఆశా వర్కర్లు నాగేశ్వరమ్మ, విజయమ్మ, చిట్టెమ్మ, జయమ్మ ఉన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



కేటీదొడ్డి: మండలంలోని ఈర్లబండ గ్రామానికి చెందిన వారు గద్వాలకు సొంత పనుల నిమిత్తం బులోరా వాహనంలో వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బోల్తాపడటంతో కొద్దిపాటి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి డాక్టర్‌తో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, అమరేష్, నాయకులు ఉన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణంలో పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి కార్యకర్తలతో కలిసి శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగుర వేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ధర్మవరంలో 22వ పోలింగ్ బూత్ అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జగదీష్ రెడ్డి, గజేంద్ర, మహేంద్రనాయుడు, రాజు, మహేష్, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం వడ్డేపల్లి మండలంలోని బూత్ నంబర్ 169లో నిర్వహించారు. టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, వడ్డేపల్లి మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంజన్నగౌడ్, కోశాధికారి రాజశేఖర్‌గౌడ్, శివ, రాఘవేంద్ర, క్రిష్ణ, సురేష్, అశోక్, వేణులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు ఉచిత బస్సు టికెట్ పంచాయితీ



ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కల్పించిన, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పంచాయితీ శనివారం ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్ 06 యూఏ 9381 నంబర్ ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం 4:30 గంటల సమయంలో వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్తుంది. ఈ సమయంలో సోళీపురం వద్ద కొందరు బస్సు ఎక్కారు. టికెట్ తీసుకునే సమయంలో ఓ 10 సంవత్సరాల బాలిక ఆధార్ కార్డు అప్‌డేట్ చేయలేదని, టికెట్ తీసుకోవాలని మహిళా కండక్టర్ చెప్పింది. ఎందుకు తీసుకోవాలి మహిళలకు ఉచితం కదా జీరో టికెట్ ఇవ్వు అని బాలిక తల్లిదండ్రులు టికెట్ తీసుకోలేదు. ఈ విషయమై కండక్టర్ బాలిక కుటుంబ సభ్యుల మధ్య తగాదా జరిగింది. చివరకు కండక్టర్ బస్సును ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విధుల్లో ఉన్న ఏఎస్ఐ సత్యంగౌడ్ సదరు బాలిక ఆధార్ కార్డు పరిశీలించారు. ఎప్పుడో చిన్నప్పటి ఫొటో ఉంది కదా నువ్వే అని కండక్టర్ ఎలా గుర్తిస్తుంది, దయచేసి కండక్టర్‌కు సహకరించాలని తెలియజేశారు. మీ నుంచి మిగతా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఒప్పుకొని టికెట్ తీసుకున్నారు. ఆ వెంటనే బస్సును అక్కడి నుంచి తరలించారు.

ఓపెన్‌హౌస్‌తో సృజనాత్మకత పెంపు


ఎర్రవల్లిలో ఓపెన్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ రాజు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో శనివారం కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి రాజు హాజరై ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలను ఆయన తిలకించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఓపెన్‌హౌస్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తరగతిగదిలో విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠ్యాంశాలను ఎంత వరకు అవగాహన చేసుకున్నారో వివిధ చార్టులతో తల్లిదండ్రులకు తెలియజేస్తే విద్యార్థుల ప్రతిభను తెలుసుకోవచ్చని అన్నారు. కిండర్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, మధుశిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ఎండ దరువు.. నీడ కరువు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- సేద దీరేందుకు చెట్లనీడే దిక్కు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు చేపట్టాలని వినతి

కేటీ దొడ్డి: గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి, కూలీలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలో పనిచేసే కూలీలకు కాసేపు సేద తీరడానికి నీడలేని దుస్థితి నెలకొంది.

కేటీదొడ్డి మండలంలోని నందిన్నె, గువ్వలదిన్నె, కేటీదొడ్డి, కొండాపురం, మల్లాపురం, ఎర్సందొడ్డి, కుచినెర్ల, చింతలకుంట, సోంపురం, పాతపాలెం, తదితర గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. వేసవి కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మేరకు ఉపాధి కూలీలకు పనిచేసే ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలి. భానుడు భగభగ మండుతుండటంతో కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, మంచి నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్టు అందుబాటులో ఉండాలి. పనిచేస్తున్న సమయంలో గాయపడితే ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఉండటం లేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లును సరఫరా చేయడంలేదు. కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. మరికొన్ని గ్రామా ల్లో కూలీలు నీళ్ల బాటిళ్ల తెచ్చుకుంటున్నారు.

నీడ కోసం టెంట్లు వేయాలి..

ఎండలో గంటల తరబడి పనులు చేస్తున్న కూలీలు అలసటకు గురై కొంత సమయం సేద తీర్చుకోవడం కోసం పని ప్రదేశంలో టెంట్లు వేయాలి. ఎక్కడా టెంట్లు వేసే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్తవి అందజేయలేదు. గతంలో ఇచ్చిన టెంట్లు చిరిగి పోయాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల వివరాలు	
మొత్తం జాబ్‌కార్డులు 12800	వర్క్ చేస్తున్న జాబ్ కార్డులు : 7000
కూలీల సంఖ్య : 2600	

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..

ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వం నుంచి టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు గతంలో వచ్చాయి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పని ప్రదేశంలో నీడ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. పని ప్రదేశంలో టెంట్లు, ఇతర అవసరాలకు ప్రతిపాదనలు మళ్లీ పంపించాం.

– అనిల్, ఏపీఓ, కేటీదొడ్డి

తుక్కుగూడ సభకు తరలిన కార్యకర్తలు


మానవపాడు నుంచి బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు


ఎర్రవల్లి నుంచి సభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల నుంచి చలో తుక్కుగూడ జన జాతర సభకు శనివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు బయలుదేరినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో భారత్‌భూషన్‌రెడ్డి, మద్దిలేటి, పరమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: హైదరాబాద్‌లోని తుక్కుగూడ జనజాతర సభకు కాంగ్రెస్ నాయకులు బయల్దేరి వెళ్లారు. మండల కేంద్రంతో పాటు ముండ్లదిన్నె, పెద్ద ధన్వాడ, పచ్చర్ల తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రైవేట్ వాహనాల్లో తరలివెళ్లారు. పెద్దింటి నాగేష్, తిమ్మప్ప, మద్దిలేటి, దస్తగిరి, జయరామన్ గౌడ్,రామకృష్ణ, బాబు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర బహిరంగ సభకు ఉమ్మడి ఇటిక్యాల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో వాహనాల్లో తరలి వెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డి, నాయకులు ఎల్కూరు శ్రీనివాసులు, జయచంద్రారెడ్డి, యువరాజు, రాజ్‌కుమార్, బజారి ఉన్నారు.

ధరూరు: మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తుక్కుగూడ సభకు తరలి వెళ్లారు. గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత, సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిల నేతృత్వంలో పెద్ద ఎత్తున వెళ్లారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని నెట్టెంపాడు, మన్నాపురం, దోర్నాల, మార్లబీడు, బరెడ్డిపల్లి, కోతులగిద్ద, అల్వలపాడు, తదితర గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు.